క్లుప్తంగా

రేవంత్‌రెడ్డిని కలిసిన ఎడవల్లి



పీసీసీ అధ్యక్షుడితో ఎడవల్లి కృష్ణ

కొత్తగూడెంరూరల్: హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ ఆదివారం కలిశారు. కొత్తగూడెం నియోజకవర్గంలో రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్ కరపత్రం విడుదల గురించి, నియోజకవర్గంలో యువశక్తి మెల్కొలిపే దిశగా ప్రతి మండలం, గ్రామాలలో ప్రచారం గురించి వివరించారు.

సీఐ రమేష్‌కు సన్మానం



రమేష్‌ను సన్మానిస్తున్న శివకుమార్

కొత్తగూడెంటౌన్: టూటౌన్ పోలీసు స్టేషన్‌లో నూతనంగా విధుల్లో చేరిన సీఐ టీ.రమేష్‌ను ఆదివారం బేతానియ ప్రార్థనా మందిర బృందం కోఆర్డినేటర్ బ్రదర్ మద్దెల శివకుమార్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

చైర్‌పర్సన్, కమిషనర్లకు..



సీతాలక్ష్మి, రఘులను సన్మానిస్తున్న ఉద్యోగులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీకి శానిటేషన్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రంగంలో ఉత్తమ మున్సిపాలిటీగా ఎంపికైన సందర్భంగా చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కమిషనర్ రఘు అవార్డు అందుకున్నారు. ఈ మేరకు ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బంది వారిని సన్మానించారు.

బదిలీ అధికారికి..



రమేష్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

చుంచుపల్లి: ఆరేళ్లుగా ఆకాశవాణి కొత్తగూడెం కేంద్రం ప్రోగ్రాం అధికారిగా పనిచేస్తున్న ఎస్.రమేష్ హైదరాబాద్ కేంద్రానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం ఆకాశవాణి కేంద్రంలో రమేష్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. రిటైర్డ్ ఆకాశవాణి కేంద్ర డైరెక్టర్ చల్లా జైపాల్‌రెడ్డి, హైదరాబాద్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ అవదానుల శ్రీహరి, బైరి శ్రీనివాసన్, శంకరరావు, ఎస్ఎన్.రెడ్డి, ప్రభాకర్, బాబు సింగ్, ఆనంద్, కోటేశ్వరరావు, సుమన్, సుగ్రీవ, స్వామి పాల్గొన్నారు.

అనధికార డంప్‌యార్డుకు నిప్పు

ఆరోగ్యంగా ఉన్న మనిషి ఆహారం లేకుండా మూడు వారాలు తట్టుకోగలడు. నీళ్లు లేకుండా మూడు రోజులు బతకగలడు. కానీ గాలి లేకుండా కేవలం మూడంటే మూడు నిమిషాలు కూడా మనలేడు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న గాలిలో స్వచ్ఛతను కాపాడుకోవడం ప్రతిఒక్కరి విధి. కానీ దానిని ఆదర్శం మాటున ఇల్లెందు మున్సిపాలిటీ, సింగరేణి గాలికొదిలేశాయి. చెత్త నిర్వహణ విషయంలో వారు అనుసరిస్తున్న నిర్లక్ష్యం.. పట్టణ శివారు గ్రామస్తులకు శాపంగా మారింది. ఆరోగ్య సమస్యలను తెచ్చిపెడుతూ అర్ధరాత్రి ఉక్కిరిబిక్కిరికి చేస్తోంది.

- ఆదర్శం మాటున మున్సిపాలిటీ, సింగరేణి నిర్వాకం
- లలితాపురంను కమ్మేస్తున్న పొగ, కాలుష్యం
- అర్ధరాత్రి ఇబ్బంది పడుతున్న ప్రజలు



డంప్ చేసేందుకు చెత్తతో వచ్చిన ట్రాక్టర్

ఇల్లెందురూరల్: గడిచిన మూడేళ్లుగా ఎనలేని ప్రగతి సాధించినట్టు ఇల్లెందు మున్సిపాలిటీ రాష్ట్ర వ్యాప్తంగా కీర్తిప్రతిష్టలు తెచ్చిపెట్టుకుంది. అన్ని విభాగాలలో ఆదర్శవంతంగా ముందుకు సాగుతున్నామని అవార్డులు సైతం సొంతం చేసుకుంది. కానీ స్థానిక సంస్థలలో కీలకమైన చెత్త నిర్వహణను మొక్కుబడిగా చేపడుతూ విమర్శల పాలవుతోంది. ఇల్లెందు పట్టణంలోని పలు వార్డులలో సేకరిస్తున్న చెత్తను నిబంధనల ప్రకారం మున్సిపాలిటీ కోసం భారీ వ్యయంతో ప్రభుత్వం నిర్మించిన కంపోస్టు యార్డ్‌కు చేర్చాలి. అక్కడ తడి, పొడి చెత్తను వేరు చేసి తడి చెత్తను ఎరువుగా మార్చే ప్రక్రియకు ఉపయోగించాలి. చెత్త రవాణాకు వార్డుకు ఒక వాహనాన్ని కూడా వినియోగిస్తున్నారు. కానీ పట్టణంలోని కొత్తకాలనీ, పరదేశీ బస్తీ తదితర ప్రాంతాల నుంచి సేకరిస్తున్న చెత్తను కొత్తకాలనీ శివారులోని లలితాపురం గ్రామ సమీపంలో డంప్ చేస్తున్నారు. ఇంతేకాకుండా జేకే కాలనీలో చెత్త సేకరణ బాధ్యత నిర్వహిస్తున్న సింగరేణి యాజమాన్యం కూడా సేకరించిన చెత్తను ఇదే ప్రాంతంలో డంప్ చేస్తోంది. ఇలా ప్రతిరోజూ చేరుకుంటున్న చెత్త ప్రస్తుతం గుట్టలుగా పేరుకుపోయింది.

కమ్మేస్తున్న పొగ..

ప్రతిరోజూ సాయంత్రం సింగరేణి, మున్సిపాలిటీ కార్మికులు గుట్టుగా వచ్చి చెత్త నిల్వకు నిప్పు పెట్టి జారుకుంటున్నారు. వేసవికావడంతో చెత్తకుప్పలపై మంటలు వ్యాపిస్తున్నాయి. దీని నుంచి వెలువడే పొగ.. సమీపంలోని లలితాపురం గ్రామాన్ని కమ్మేస్తోంది. పొగ,చెత్త నుంచి వెలువడే విషవాయువులు గ్రామస్తులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రాత్రివేళ నిద్రకు ఉపక్రమించిన సమయంలో ఈ సమస్య ప్రజలకు శివరాత్రి గుర్తుకు తెస్తోంది.

ఫిర్యాదు చేసినా పట్టింపు లేదు..

పట్టణంలోని కొత్తకాలనీ, లలితాపురం గ్రామ శివారులో మున్సిపాలిటీ, సింగరేణి నిల్వ చేస్తున్న చెత్త, దానికి నిప్పు పెట్టడం వల్ల వెలువడుతున్న విషవాయువులు, పొగ వల్ల తాము పడుతున్న ఇబ్బందులపై ఇప్పటికే గ్రామస్తులు మున్సిపల్ అధికారులకు నేరుగా ఫిర్యాదు చేశారు.

అయినా స్పందన లేకపోవడంతో ఆగ్రహించిన లలితాపురం గ్రామ యువత చెత్త డంప్ యార్డు వద్ద కాపుకాసి చెత్త డంప్ చేయకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు.



నిప్పు పెట్టిన చెత్త నుంచి వెలువుడుతున్న పొగ

పొంచి ఉన్న శ్వాసకోశ సమస్యలు..

మున్సిపాలిటీ, సింగరేణి ఇంటింటి నుంచి సేకరిస్తున్న పలు రకాల వ్యర్థాలను గ్రామ శివారులో డంప్ చేస్తున్నారు. చెత్తలో గృహ వినియోగ వ్యర్థాలతోపాటు ఇతరత్రా రసాయనాలు, ప్రమాదకర వాయువులను వెదజల్లే వ్యర్థాలు కలిసి ఉండే ప్రమాదం లేకపోలేదు. ఇటువంటి పరిస్థితిలో సేకరించిన చెత్తను ఒకచోట డంప్ చేసి నిప్పు పెట్టడం, దాని నుంచి వెలువడే వాయువులు ఏ సమస్యలు తెచ్చిపెడతాయో నిపుణులే చెప్పాలి. ఇటువంటి పరిస్థితిలో అన్నింటా ఆదర్శంగా నిలుస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న మున్సిపాలిటీ.. పారిశుద్ధ్యం, పచ్చదనానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని బీరాలు పలుకుతున్న సింగరేణి.. తాము ఎదుర్కొంటున్న వాయుకాలుష్యం సమస్య నుంచి గట్టెక్కించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



మున్సిపాలిటీ వార్డులు, సింగరేణి కార్మికవాడలలో సేకరించిన చెత్తను మా గ్రామ సమీపంలో డంప్ చేస్తున్నారు. చెత్త పేరుకుపోయింది. కొద్ది రోజులుగా రాత్రివేళ చెత్తకు నిప్పు పెడుతున్నారు. చెత్త నుంచి వెలువడే పొగ, విష వాయువులు గ్రామాన్ని కమ్మేస్తున్నాయి. దీనివల్ల శ్వాస ఆడక ఇబ్బంది పడుతున్నాం. రాత్రి జాగారం చేయాల్సి వస్తోంది.

– జోగ రమేష్, లలితాపురం

ఎవరూ పట్టించుకోవడం లేదు



చెత్తకు నిప్పు పెట్టడం వల్ల గ్రామంలోకి పొగ, విషవాయువులు చేరి ఇబ్బంది పెడుతున్నాయని మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశాం. అయినా మార్పు రాలేదు. చేసేది లేక రెండు రోజులుగా కాపుకాసి చెత్త డంప్ చేయకుండా అడ్డుకుంటున్నాం. అధికారులు స్పందించి చెత్త డంప్ చేయకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.

– కాలం వేణు, లలితాపురం

చర్యలు తీసుకుంటాం



పట్టణంలో సేకరిస్తున్న చెత్తను మున్సిపల్ కంపోస్టు యార్డ్‌కు తరలిస్తున్నాం. కొత్తకాలనీ కాల్వలలో తొలగించిన పూడికను మాత్రమే సమీపంలో డంప్ చేస్తున్నాం. చెత్త కూడా తరలిస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం సింగరేణి కాలనీలలో సేకరిస్తున్న చెత్తను అక్కడ డంప్ చేస్తున్నట్లు మాకు సమాచారం ఉంది.

– అంకుష్‌షావలి, కమిషనర్, ఇల్లెందు మున్సిపాలిటీ

స్వచ్ఛ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న పానిశెట్టి వెంకటేశ్వర్లు

పాల్వంచరూరల్: మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద రెండు రోజులుగా సమ్మె చేస్తున్న స్వచ్ఛ కార్మికుల దీక్ష శిబిరాన్ని ఆదివారం పానిశెట్టి సందర్శించి సంఘీభావం తెలిపారు. మాట్లాడుతూ.. కొత్తగూడెం, ఇల్లెందు మున్సిపాలిటీలో వేతనాలు ఇస్తున్నప్పుడు పాల్వంచలో ఎందుకు ఇవ్వడం లేదన్నారు. ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా పనులు చేస్తున్న కార్మికులు వేతనాలు అడిగే సరికి మున్సిపాలిటీ ఎలాంటి సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటికైనా కలెక్టర్, ఎమ్మెల్యే స్పందించి కార్మికులకు పనికి తగిన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి.ప్రభాకర్, కటికల రంజిత్, జైన్, మాదారపు లక్ష్మణ్, మాలోతు ప్రశాంత్, కోళ్లపుడి ప్రవీణ్, బర్ల నాగరాజు, మల్లికార్జున్, నాగమణి, జ్యోతి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

నేడు హరితోత్సవం

ఇల్లెందురూరల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం హరితోత్సవం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఉదయం తొమ్మిది గంటలకు కళాశాల ఆవరణలో పెద్దమొత్తంలో మొక్కలు నాటనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్ తదితరులు హాజరవుతారని తెలిపారు.

22న సర్వసభ్య సమావేశం

టేకులపల్లి: ఈనెల 22న ఉదయం 11 గంటలకు టేకులపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీఓ కోట వీరబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా అమరుల సంస్మరణను పురస్కరించుకుని ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు. అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

సింగరేణి(కొత్తగూడెం): జాతీయ కార్మిక సంఘాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం అధ్యక్షుడు బి.వెంకట్రావ్ అన్నారు. ఆదివారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని ఇల్లందు గెస్ట్‌హౌజ్‌లో టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ సమావేశం జరిగింది. మాట్లాడుతూ.. రానున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో యూనియన్ విజయానికి ప్రతిఒక్కరూ శక్తి మేరకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి, వర్కింగ్ ప్రసిడెంట్, వివిధ ఏరియాల ఉపాధ్యక్షులు, 11 మెన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి

కొత్తగూడెంఅర్బన్: ఏజెన్సీలో భూములకు టైటిల్ హక్కు పత్రాలు లేకపోవడంతో బ్యాంకు రుణాలు మంజూరు సమస్య ఏర్పడుతోందని, ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఉపాధ్యాయులకు కనీస ధరకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ.వెంకటేశ్వరరావు, రవి డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రభాకర్, చంద్రశేఖర్, సంజీవ్‌రావు, శ్రీకాంత్, మోతిలాల్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటితో సంపూర్ణ ఆరోగ్యం



ఇల్లెందు: మంచినీళ్ల పండుగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బానోతు హరిప్రియ

చుంచుపల్లి: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని ప్రతి గ్రామపంచాయతీలో మంచినీటి పండుగ నిర్వహించారు. గ్రామాల్లోని మంచినీటి ట్యాంకులను నుంచి ర్యాలీగా బయలుదేరి గ్రామపంచాయతీల వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ఇందులో భాగంగా రామాంజనేయ కాలనీ గ్రామ పంచాయతీలో సర్పంచ్ జ్ఞానమూర్తి సరిత నేతృత్వంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీపీ బాదావత్ శాంతి పాల్గొని ప్రసగించారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామాల్లో మంచినీటి సమస్య తొలగి పోయిందన్నారు. నేడు ప్రతి మారుమూల గ్రామాలకు మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరు సరఫరా అవుతోందని చెప్పారు. మిషన్ భగీరథ నీటిని తాగడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మంద, మంగమ్మ, ఎంపీఓ సత్యనారాయణ, మిషన్ భగీరథ డీఈ, ఏఈలు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: ప్రజల మంచినీటి కష్టాలకు పరిష్కారం చూపాలని సీఎం కేసీఆర్ భగీరథ యత్నం చేసి సఫలమయ్యారని ఎమ్మెల్యే హరిప్రియ, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఇల్లెందులపాడు 2వ వార్డులో కాళీమాత టెంపుల్ వాటర్ ట్యాంకు వద్ద దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన తెలంగాణ మంచినీళ్ల పండుగ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇంటింటికీ నల్లా నీరు ఇవ్వకుంటే ఓట్లు అడగం అన్న ఏకైక సీఎం కేసీఆర్ మాత్రమేనన్నారు. తెలంగాణలో సాగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలో లేవన్నారు. ఇల్లెందులో రూ.31 కోట్లతో మిషన్ భగీరథ స్కీం ప్రవేశపెట్టి 78 కిలోమీటర్ల పైపులైన్ నిర్మాణం చేసి 5,565 ఇళ్లకు నల్లాల ద్వారా మంచినీళ్లు ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ అంకుషావలీ, దిండిగల రాజేందర్, పులిగళ్ల మాధవరావు, మిషన్ భగీరథ డీపీఎం విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: మిషన్ భగీరథ పథకం ద్వారా స్వరాష్ట్రంలో తాగునీటి కష్టాలు తీరాయని ఎంపీపీ చీమల నాగరత్నమ్మ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం పలు గ్రామాలలో మంచినీళ్ల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామపంచాయతీలలో తాగునీటి పథకాలను అందంగా అలంకరించారు. గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి తాగునీటి పథకాల వరకు ప్రదర్శన నిర్వహించారు. మిషన్ భగీరథ అధికారులు, సిబ్బంది గ్రామంలో తాగునీటి పథకం వివరాలను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీలు, డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్, ఎంపీడీఓ బాలరాజు, ఎంపీఓ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో ఆదివారం మంచినీళ్ల పండుగ ఘనంగా నిర్వహించారు. అధికారులు గ్రామపంచాయతీల్లోని నీటి ట్యాంకుల వద్దకు ప్రజలను తీసుకెళ్లి ట్యాంకుల వినియోగం, నీటి సరఫరా, సురక్షిత మంచినీరు గురించి వివరించారు. జెడ్పీ సీఈఓ విద్యాలత తొమ్మిదోమైలు తండా పంచాయతీలో పర్యటించారు. ఎంపీడీఓ కోట వీరబాబు, ఎంపీఓ గణేష్ గాంధీ, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మంచినీళ్ల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు, సెక్రటరీల ఆధ్వర్యంలో ఎంపీటీసీలు, ఉపసర్పంచ్‌లు, వార్డుసభ్యులు, పంచాయతీ కార్మికులు, ప్రజలు ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో లకావత్ గిరిబాబు, సర్పంచ్‌లు, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.



చుంచుపల్లి: రామాంజనేయకాలనీలో మంచినీటి పండుగ ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



టేకులపల్లి: కోయగూడెంలో కార్మికుడికి సన్మానం



ఇల్లెందురూరల్: పోలారంలో మిషన్ భగీరథ సిబ్బందిని సన్మానిస్తున్న సర్పంచ్ సరోజిని

బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి



హాజరైన బీఆర్‌ఎస్ కార్యకర్తలు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్

జూలూరుపాడు: భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ పిలుపునిచ్చారు. ఆదివారం గుండెపుడి ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో జరిగిన బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రైతుబంధు పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. మూడోసారి కూడా కేసీఆర్‌ను సీఎంగా గెలిపించేందుకు కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పని చేయాలన్నారు. పార్టీ అధిష్టానం ఎవరికి బిఫామ్ ఇస్తే వారి గెలుపుకోసం పని చేయాలని కార్యకర్తలు, నాయకులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో చావా వెంకటరామారావు, మూడ్ చిట్టిబాబు, దుద్దుకూరి నాగేశ్వరరావు, హరిలాల్, మాళోత్ నరసింహారావు పాల్గొన్నారు.

తునికాకు కూలి డబ్బులు చెల్లించాలి



మాట్లాడుతున్న ఓక్లా నాయక్

టేకులపల్లి: తునికాకు కార్మికులకు కూలి డబ్బులు వెంటనే చెల్లించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు బానోతు ఊక్లా నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తునికాకు సేకరించి రెండు నెలలు గడుస్తున్నా నేటికీ కార్మికులకు డబ్బులు చెల్లించకుండా ప్రభుత్వం, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ గిరిజనులకు, ఇతర పేదలకు రెండో పంటగా తునికాకు సేకరణ ఉంటుందని దాని ద్వారా వచ్చే ఆదాయంతో వేసవికాలంలో కుటుంబ పోషణ, పిల్లల చదువులు, వైద్య ఖర్చులకు ఉపయోగపడాల్సింది పోయి నేటికీ వారికి డబ్బులు చెల్లించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. రాష్ట్రంలో 45 యూనిట్లలో ఆకు సేకరణ జరిగిందని దాదాపు రూ.60 కోట్ల వరకు పేదలకు అందాల్సి ఉందని వాటిని వెంటనే చెల్లించాలని లేదంటే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఆదివాసీలు అంటే అంత అలుసు ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వాలు ఎన్నికల, దశాబ్ది ఉత్సవాల హడావుడిలో పడి ఆదివాసీలను మర్చిపోయారని విమర్శించారు. కార్యక్రమంలో భూక్యా హర్ష, పేనక రామస్వామి, అమర్ సింగ్, నర్సింగ్, లింగ పాల్గొన్నారు.

బదిలీ జీఎంకు ఆత్మీయ వీడ్కోలు



షాలేమురాజును సత్కరిస్తున్న ఉద్యోగులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం షాలేమురాజు బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆదివారం జీఎం కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నేతలు ఘనంగా సత్కరించారు. శాలువా కప్పి జ్ఞాపిక అందజేశారు.

కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం మల్లారపు మల్లయ్య, రక్షణ అధికారి పంజాల శ్రీనివాస్, జీవీ మోహన్‌రావు, వెంకటరామచంద్ర, ప్రహ్లాద్, యూసబ్, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్, ఏఐటీయూసీ నేత లచ్చిరాం, ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్, హెచ్ఎంఎస్ వైస్ ప్రెసిడెంట్లు లింగాల జగన్నాథం, నాయని సైదులు, బాలప్రసాద్ తదితరులు ఉన్నారు.

30న ప్రగతిభవన్ ముట్టడి



మాట్లాడుతున్న రాజేష్‌నాయక్

కొత్తగూడెంటౌన్: గిరిజనుల హక్కులను తుంగలో తొక్కి బంధుప్రీతి చాటుకుంటున్న, హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో అవినీతికి పాల్పడుతున్న హెల్త్ డైరక్టర్ గడల శ్రీనివాసరావుపై తక్షణమే సీఎం చర్యలు తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం మేదరబస్తీలో ఎస్టీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రాజేష్‌నాయక్, గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ మాట్లాడారు. హెల్త్ డైరక్టర్ గడల శ్రీనివాసరావు ప్రభుత్వ అధికారా.. బీఆర్‌ఎస్ నాయకుడా సీఎం కేసీఆర్ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. కొత్తగూడెంలో ఇటీవల వివిధ పార్టీల నాయకులను తన బృందంతో పిలిపించుకుని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చి రాజకీయ మద్దతుని ఇవ్వాలని కోరుతున్నారని ఆరోపించారు. జీఎస్ఆర్ ట్రస్ట్ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న గడల శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనుల హక్కులను కాపాడుకునేందుకు జూన్ 30న ప్రగతిభవన్ ముట్టడి నిర్వహిస్తున్నామని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పంతుల్యా నాయక్, మోహన్‌నాయక్, కేశవ్ నాయక్, లాలు, నాగేశ్వరావు, హుస్సేన్, లరుణ్‌నాయక్ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణంలోని శ్రీరామచంద్ర బాలుర ఉన్నత పాఠశాల 2000–01 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం వరకు ఆటపాటలతో గడిపారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు.



అటెన్షన్ ప్లీజ్

నిరుపయోగంగా కమ్యూనిటీ హాలు



టేకులపల్లి మండలం ప్రెగళ్లపాడు పంచాయతీ తెలుగూరు గ్రామంలో నిర్మించిన కమ్యూనిటీ హాలు నిరుపయోగంగా ఉంటోంది. 20 ఏళ్ల క్రితం అప్పటి జెడ్పీ చైర్మన్ గోనెల విజయలక్ష్మి నిధులతో గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం స్థలంలో కమ్యూనిటీ హాలు నిర్మించారు. పలు కారణాలతో నేటికీ అది వినియోగంలోకి రాలేదు. ప్రస్తుతం అందులో తాత్కాలిక అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి భవనానికి మెరుగులు దిద్ది కమ్యూనిటీ హాలుగా ఉపయోగించాలని స్థానికులు కోరుతున్నారు. – టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : కోట వీరబాబు, ఎంపీడీఓ, టేకులపల్లి
సెల్ నెంబర్: 9281479238